క్లుప్తంగా

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి



మరికల్: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు ముగ్గువేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం దశలవారిగా బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో హరీశ్, జనార్దన్, సత్యానారాయణ, రవి, శ్రీను, వేణు, రామకృష్ణారెడ్డి, విజయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన



నారాయణపేట టౌన్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో వెన్నెల కల్చరల్ అకాడమీ కళాకారులు టీఎస్‌ఏసీఎస్ ఆదేశాల మేరకు డీఏపీసీయూ, వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో పీహెచ్‌సీ దగ్గర హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు పాటలు పాడుతూ పల్లె సుద్దుల ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు నర్సింములు, చెన్నయ్య, ఝాన్సీ, రవిశంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపూర్‌లో సన్నాహక సమావేశం



ధన్వాడ: మండలంలోని కృష్ణాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమాయాత్త సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ ఎవరికి కేటాయించిన వారికి అందరూ మద్దతు తెలపాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ఒక్కొక్క కేటగిరి నుంచి ఎవరు ఎవరు పోటీ చేస్తారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేటగిరి నుంచి ఇద్దరు, ఇద్దరు ముందుకు రావడంతో వారి పేర్లను నమోదు చేశారు. సమావేశంలో జేపీసీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, దమోదర్‌రెడ్డి, అంజనేయులు, గోపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మక్తల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన క్రీడల్లో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 44వ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టు 8 జిల్లాలను ఓడించి నాలుగో స్థానంలో నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఇండియా ప్రధాన కార్యదర్శి రీతురాజ్ తెమర్, రాష్ట్ర అధ్యక్షుడు కార్యదర్శులు శ్రీనివాసులు, ఐలయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘననివాళి



నారాయణపేట రూరల్: నేటి కళాకారులకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మార్గదర్శకుడని బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బాల కేంద్రంలో గురువారం బాలు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 18 భాషల్లో 45వేలకు పైగా గీతాలను ఆలపించారని, ఎంతోమంది కళాకారులను ప్రోత్సహించారని ఆయన సేవలను కొనియాడారు.

ఊరించి... ఉసూరుమనిపించి!

- రాజీవ్ యువ వికాసంపై నిరుద్యోగుల ఆవేదన
- పథకం అమలుకు యువత ఎదురుచూపులు



కోస్గి ఎంపీడీఓ కార్యాలయం (ఫైల్)

కోస్గి రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు నోచుకోవడం లేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగిసినా తుది జాబితాను విడుదల చేయడం లేదు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లోన్ మంజూరు పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టగా చివరి నిమిషంలో వాయిదా పడింది. రాష్ట్ర మంత్రి వర్గంలోనూ ఏ నిర్ణయం తీసుకోలేదు. దీంతో పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువత నిరాశకు గురవుతున్నారు.

అయోమయంలో దరఖాస్తుదారులు

కోస్గి మున్సిపాలిటీతో పాటు కోస్గి మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. మండలానికి ఇచ్చిన లక్ష్యం ప్రకారం రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను అందజేస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికైనా అమలు చేసి ఆర్థికసాయం అందించాలని నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నారు.

రూ.50 వేల వరకు సబ్సిడీ...

రూ.50వేల వరకు రుణం తీసుకునే నిరుద్యోగులకు పూర్తి స్థాయిలో సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆపై రుణాలను బ్యాంకు లింకేజీల ద్వారా ఇస్తూ యూనిట్ విలువ ఆధారంగా సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోస్గి మున్సిపాలిటీ, మండలం మొత్తం సుమారు 600 యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది.

1185 దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి కోస్గి మున్సిపాలిటిలో పరిధిలోని 16 వార్డులకు గాను 1102, కోస్గి మండలంలోని 14 గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 1185 దరఖాస్తులు వచ్చాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి బిసీ-746 , ఎస్సీ-227 , ఎస్టీ-60 , మైనారిటీ-68 , ఈడబ్ల్యూఎస్-15 , కుల ధృవీకరణపత్రం లేకుండా దరఖాస్తు చేసుకున్నవారు 69 మంది ఉన్నారు. కోస్గి మున్సిపాలిటీలో 16 వార్డుల నుంచి బీసీ-688 , ఎస్సీ-192 , ఎస్టీ-01 , మైనారిటీ-215, ఈబీసీ-06 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండల స్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశలన చేసి తుది జాబితాను గతంలోనే విడుదల చేశారు. అయితే మరింత లోతుగా విచారణ చేసిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికైనా వెంటనే అర్హులను ఎంపిక చేసి యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



రాజీవ్‌యువ వికాసం పథకం గురించి తమకు ఉన్నతాధికారుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గతంలో దరఖాస్తులు ఆహ్వానించగా మండలంలో 1185 వరకు దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వస్తే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

–శ్రీధర్, ఎంపీడీఓ, కోస్గి

పట్టుదలతో చదివితేనే భవిష్యత్



మక్తల్: ప్రతి ఒక్క విద్యార్థి పట్టుదలతో చదివితేనే భవిష్యత్ ఉంటుందని శ్రీ అయ్యప్ప డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ అంజిరెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే సందరర్భంగా డిగ్రీ పాసైన 72 మంది విద్యార్థులకు పట్ట సర్టిఫికెట్లు , ధృవీకరణ పత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని , విలువలతో కూడిన విద్యతోనే సార్థకత లభిస్తుందన్నారు. డిగ్రీ తోపాటు కంప్యూటర్ కోర్సు నేర్చుకోవాలన్నారు. సమాజంలో చదువుకున్న వాడికి విలువ ఉంటుందని, ప్రతి ఒక్కరు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు గుర్తింపు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనంత్‌రెడ్డి, డైరెక్టర్స్ హరిప్రసాద్, గోవర్ధన్, రవికుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘భగత్‌సింగ్ చౌరస్తా’ పేరును కొనసాగించాలి



ఎంపీ డీకే అరుణకు వినతి అందజేస్తున్న హిందూ ధార్మిక సంఘం నాయకులు

మక్తల్: పట్టణంలో మున్సిపాలిటీకి వెళ్లే చౌరస్తాకు ఆజాద్‌నగర్ చౌరస్తా అని నామకరణం చేయాలని హిందుధార్మిక సంఘం సభ్యులు గురువారం ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. గతంలో భగత్‌సింగ్ చౌరస్తాగా పిలువబడే కాలనీకి కొందరు పెరియార్ చౌరస్తాగా నామకరణం చేసి ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారన్నారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన భగత్‌సింగ్ పేరును మార్చడం ఆయనను అవమానించినట్లేనన్నారు. వెంటనే అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించాలని అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాంరెడ్డి, మండల అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాంమాదవ్ , సత్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ జయంతి వేడుకలు



మరికల్‌లో మొక్కలు నాటుతున్న నాయకులు

మరికల్: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ మాట్లాడుతూ దీన్ దయాల్ జయంతి సందర్భంగా స్థానిక హరిజన్‌వాడలో ఇంటింటికి ఒక్కొక్క మొక్కను అందజేసి నాటించారు. బీజేపీ నాయకులు తిరుపతిరెడ్డి, వేణు, భాస్కర్ రెడ్డి, రాజేష్, రమేష్, సురేందర్‌గౌడ్, రాజు, శివ, చెన్నయ్య, వెంకటేష్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

మక్తల్‌లో శ్రమదానం

మక్తల్/ఊట్కూర్: పండిత్ దీన్ దయాళ్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. దీన్ దయాళ్ శత జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పోస్టాఫీస్ కార్యాలయం దగ్గర శ్రమదానం నిర్వహించారు.

దీన్‌దయాళ్ ఆశయాలు కొనసాగిద్దాం

మాగనూర్: దీన్ దయాళ్ జయంతి సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఆయన ఆశయాలను సాధించడానికి గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



నారాయణపేట రూరల్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు, పాలమూరు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. పట్టణంలో నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని గుర్తు చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇటీవల రవాణా శాఖ మంత్రిని కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డ్, పెన్షన్ ఇబ్బందుకు లేకుండా వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టడ్, వ్యవస్థాపకులు రహమాన్ సోఫీ, బసన్న, సత్యనారాయణ, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టు సరికాదు



అంగన్‌వాడీ టీచర్లను అదుపులోకి తీసుకున్న మరికల్ పోలీసులు

నారాయణపేట రూరల్: తమ హక్కుల కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి బల్ రామ్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకుల ఇళ్లకు వెళ్లి పోలీసులు తెల్లవారుజామునే అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్యల సాధనకు శాంతియుతంగా పోరాటం చేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు

మరికల్: తమ సమస్యల పరిష్కారం కోసం చలో సెక్రటేరియట్‌కు పిలుపుఇచ్చిన అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు పోలీస్‌స్టేషన్‌లోనే నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లు నెరవేర్చేందుకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రామరెడ్డి

దామరగిద్ద: రాష్ట్ర ఫార్మసి అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఫార్మసి అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్రామరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్రామరెడ్డి ఏకగీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా శ్రీధర్, రేణుక స్వామి, కార్యదర్శిగా సూర్యకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు

కోస్గి రూరల్: మండలంలో కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో మద్యం దుకాణాల దరఖాస్తుకు గురువారం రిజర్వేషన్లు ప్రకటించినట్లు కోస్గి ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. కోస్గి పరిధిలోని మొత్తం 14 మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు వెలువడ్డాయన్నారు. నేటి నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నామని, అక్టోబర్ 23న డ్రా తీసి షాపులు కేటాయిస్తామన్నారు. ఒక్కో షాప్‌కు రూ.3 లక్షలు నాన్ రీఫండబుల్ టెండర్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చెత్త తీయరు.. శుభ్రం చేయరు





జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో చెత్త పేరుకుపోయింది. ముఖ్యంగా ప్రతిభ కాలనీకి వెళ్లే రహదారికి ఎడమ వైపున ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్త పేరుకుపోయి డంప్‌యార్డులా తయారైంది. అదే విధంగా పాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమీపంలో కూడా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రి దగ్గరలో కూరాగాయల, మాంసహార మార్కెట్లు ఉండడం వల్ల మిగిలిన వ్యర్థాలను ఆస్పత్రి పక్కనే వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. - నారాయణపేట టౌన్

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



జోగులాంబ మాతగా అమ్మవారు



ధన్వాడలో అమ్మవారి ప్రతిమ వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు ఎస్ఎస్‌కే సమాజ్ భవానీ ఆలయంలో విటోబా రుక్మిణి దేవిగా,శక్తిపీఠంలో కాత్యాయని దేవిగా, పళ్ల హనుమాన్ మందిరం దగ్గర లలిత త్రిపుర సుందరిగా, మహంకాళి దేవాలయంలో అన్నపూర్ణదేవిగా, బ్రహ్మన్‌వాడీ చౌడేశ్వరీ మాత ఆలయంలో అలంపూర్ జోగులాంబ దేవిగా దర్శనమిచ్చారు.

నారాయణపేట రూరల్: పట్టణంలోని కొటకొండ వాసవి మాత ఆలయంలో అమ్మవారిని వన దుర్గాదేవిగా సింగారం శ్రీహరిపీఠంపై కాత్యాయనీ దేవిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు.

సీరియల్ నటి ప్రత్యేకపూజలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం శక్తిపీఠంలో తెలుగు సీరియల్ నటి దుర్గా ప్రత్యేక పూజలు జరిపించారు. గురువారం శక్తిపీఠాన్ని దర్శించుకున్న ఆమె బ్రహ్మోత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని హోమంలో పాల్గొ న్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కోస్గి: పట్టణంలోని మున్నూర్ వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారు కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నారింజరంగు చీరతో పాటు పెసళ్లు, బెబ్బెర్లతో నైవేద్యం సమర్పించారు.

ధన్వాడ: పట్టణంలోని మారుతీనగర్ ఉత్సవకమిటీ, స్థానిక రజక సంఘం, బీసీ కాలనీలో, గంగాదేవి ఆలయం, వీరభద్రేశ్వరస్వామి దేవాలయం, అంబ భవానీ ఆలయం, దత్తాత్రేయ ఆలయంలో కొలువు దీరిన అమ్మవారిని భక్తులు గాయత్రి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

నర్వ: నర్వ, లంకాల్, పెద్దకడ్మూర్, ఎల్లంపల్లి, బెక్కర్‌పల్లి, అయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారు గురువారం కాత్యాయిని దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ఇష్టమైన చీర, నైవేద్యాలను సమర్పించి పూజలు జరిపించారు.



మరికల్: దేవీ శరన్న వరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద్దచింతకుంటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు తులసి దళలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.



పెద్దచింతకుంటలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

కృష్ణా: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట కొందరు అక్రమార్కులు ఇసుకను కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మాగనూర్ వాగు నుంచి కర్ణాటక సరిహద్దులో గల ఇటుకల బట్టీలో ఇసుకను డంపు చేసి, అక్కడి నుంచి రాత్రి సమయంలో టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకవేళ చర్యలు తీసుకున్నా కేవలం కేసునమోదు చేసి వదిలివేస్తుండడంతో అక్రమార్కులకు మరింత రెచ్చిపోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి కర్ణాటకకు తరలుతున్న ఇసుక అక్రమ రవాణను అరికట్టాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వివిధ రాజకీయ పార్టీల నాయకులు హెచ్చరిస్తున్నారు.

ఒకరికే మూడు బాధ్యతలు

మాగనూర్: రాష్ట్రంలో ప్రత్యేక అధికారుల పాలనతో ఓవైపు అభివృద్ధి కుంటు పడుతుండగా మరో వైపు అధికారుల కొరతతో సమస్య మరింత జటిలమవుతుంది. మాగనూర్ మండలం ఎంపీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మికి ఇటు కృష్ణ మండలం ఎంపీఓతో పాటు అదనపు ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు మాగనూర్ మండలంలోని నేరడగం, ఉజ్జెల్లి, కృష్ణ మండలంలోని గుడెబాల్లూరు, ముురహర్‌దొడ్డి, హిందూపూర్ ఐదు గ్రామాలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించారు. దీంతో గ్రామాల పర్యవేక్షణతో పాటు పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి మండలానికి నూతన ఎంపీవోని నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కడంపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాస్ సమీపంలోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆయుధాలను తనిఖీ చేసిన డీఎస్పీ



నారాయణపేట: వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం నారాయణపేట పోలీస్ హెడ్ క్వాటర్స్ లోని ఆయుధాలను తనిఖీ చేశారు. అంతకుముందు ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను డీఎస్పీ శ్రీనివాస రావు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని వివిధ రకాల ఆయుధాలను పరిశీలించి బుల్లెట్ల నిల్వ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆయుధాలను కండిషన్‌లో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఆర్ఐ నరసింహ, సీఐలు శివశంకర్, శిరీష, కృష్ణ చైతన్య, ఎఆర్ ఎస్ఐలు నరేందర్ గౌడ్, యాదయ్య, పోలీసు సిబంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



మరికల్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కాంప్లెక్స్ దగ్గర ఆందోళన నిర్వహించారు. కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో పండగలు కూడా జరుపుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. తమతో వెట్టి చాకరి చేయించుకుంటున్న ప్రభుత్వం తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ కొండన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



నారాయణపేట ఆర్టీసీ డిపోలో బతుకమ్మలతో మహిళలు

నారాయణపేట రూరల్: నారాయణపేట ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు రంగు రంగు పూలతో బతుకమ్మను తయారుచేసి తలపై పెట్టుకుని ఊరేగింపుగా వచ్చారు. డిపో ఆవరణలో మహిళా అధికారులు, ఉద్యోగులు కండక్టర్‌లతో కలిసి ఆటపాటలతో బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం లావణ్య, ట్రాఫిక్ సూపర్‌వైజర్ శ్రీశైలమ్మ, ఉద్యోగులు శ్రీలక్ష్మి, భాగ్యమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

కాన్‌కుర్తిలో బతుకమ్మ వేడుకలు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక మహిళలు బతుకమ్మ ఆటపాటలతో అలరించారు.